క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

షాబాద్: పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని షాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బోండపహాడ్‌కు చెందిన కళ్లెం అనంతయ్య అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులు సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం ఆయన భార్య పద్మమ్మకు రూ.లక్ష విలువైన సీఎం ఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు రాంచంద్రారెడ్డి, ఏండీ ఇనాయత్ తదితరులున్నారు.

పశువుల సంరక్షణకు జాగ్రత్తలు అవసరం

మండల పశువైద్యాధికారి దేవిరెడ్డి



పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్ దేవిరెడ్డి

మొయినాబాద్: పశువుల సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లిలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధులు గుర్తించి వైద్యం చేశారు. దూడలనకు నట్టల నివారణ మందులు, పశువులకు చూడి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులు, జీవాలకు రోగాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా టీకా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పద్మ, కుమార్, భీమ్, పాడి రైతులు రామకృష్ణ, పరమేశ్, నారాయణ, గాలయ్య, రాజశేఖర్, శంకరయ్య, మల్లయ్య, శ్రీశైలం, యాదయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

సర్పంచ్ శోభారెడ్డి



ర్యాలీని ప్రారంభిస్తున్న సర్పంచ్ శోభారెడ్డి

మొయినాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని మహిళా సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, కేతిరెడ్డిపల్లి సర్పంచ్ దారెడ్డి శోభావెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కేతిరెడ్డిపల్లి గ్రామంలో స్వచ్ఛత ఈ సేవా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లల్లోని చెత్తను చెత్త బండిలు వచ్చినప్పుడు పంచాయతీ కార్మికుల సహాయంతో బండిలో వేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోనే మానవుడికి ఆరోగ్యం అన్నారు. గ్రామ అభివృద్ధిలో యువత పాలుపంచుకోవాలని సూచించారు. సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దారెడ్డి వెంకట్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తారాబాయ్, ఉపసర్పంచ్ సిద్ధయ్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి వినతి

తలకొండపల్లి: మండలంలోని రాంపూర్ గ్రామానికి పొదుపు మహిళా సంఘం సమావేశ భవనాన్ని మంజూరు చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ఎంపీపీ నిర్మలతో కలిసి జెడ్పీటీసీ వినతిపత్రం అందజేశారు. 35 పొదుపు సంఘాల్లో సుమారుగా 500కు పైగా సభ్యులు ఉన్నారని తెలిపారు.

కత్తెర కాటు.. రైతుకు చేటు..!

దెబ్బతింటున్న మొక్కజొన్న పంట
- ఆందోళనలో అన్నదాతలు



ఫరూఖ్‌నగర్‌లో కత్తెర పురుగు సోకిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



మొక్కజొన్న పంటకు సోకిన కత్తెర పురుగు

షాద్‌నగర్: ఆరుగాలం శ్రమించే అన్నదాతలను కత్తెర పురుగు కలవర పెడుతోంది. పంట ఎదుగుతున్న క్రమంలో ఈ పురుగు దాడి చేస్తుండటంతో రైతులు కుదేలు అవుతున్నారు. రోజుకు వందల కిలోమీటర్ల దూరం వెళ్లే సామర్థ్యం ఉన్న ఈ పురుగు మొక్కజొన్న పంట పై విరుచుకుపడుతోంది. దీంతో మొక్కజొన్న పంట పాడై రైతులు ఆందోళన చెందుతున్నారు.

తీవ్రమైన దాడి

మొక్కజొన్న విత్తిన నాటి నుంచి రెండు నెలల వరకు పంటకు ఎలాంటి చీడ పీడలు సోకలేదు. పంట దిగుబడి ఎక్కువగా వస్తుందని ఆశిస్తున్న సమయంలోనే కత్తెర పురుగు కాటు వేసింది. కొన్ని రోజులుగా షాద్‌నగర్ ప్రాంతంలో మొక్కజొన్న పంటపై ఈ పురుగు దాడి తీవ్రమయింది. ఇప్పటికే ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఈ పురుగు తమను మరింత ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టేస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కజొన్నే ప్రధాన పంట

రైతులు పండించే పంటల్లో ప్రధానమైనది మొక్కజొన్న. ఈ పంటకు కత్తెర పురుగు వ్యాపించి ఆకులను క్రమంగా తినడంతో కత్తిరించినట్లు కనబడుతుంది. మొక్కజొన్న కాండాన్ని తొలిచి రంధ్రాలను చేసి పంటను తీవ్రంగా నష్టపరుస్తుంది. దీని జీవిత కాలం ఒక నెల నుంచి మూడు నెలల వరకు ఉంటుంది.

నివారణ ఇలా..

కత్తెర పురుగును కట్టడి చేసేందుకు తగిన మందులు పిచికారి చేయడంతో పాటుగా నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

- పక్షి స్థావరాలు, లింగాకర్షక బుట్టలు, లైట్ ట్రాప్స్ ఏర్పాటు చేయాలి.
- సాయంత్రం వేల పొలం గట్లపై మంట పెట్టాలి.
- ప్రస్తుతం పంటలు సాగు చేసి 45 రోజుల కంటే ఎక్కువ కావడంతో 5 ఎంఎల్ వేప నూనె, 1 ఎంఎల్ లామ్డసైలోత్రిగ్, 50గ్రాముల సర్ఫ్‌పొడి మిశ్రమం చేసి పంట పై పిచికారీ చేయాలి.
- పిచికారీ సాయంత్రం 5 గంటల తర్వాత చేస్తే పురుగు, గుడ్లపై మందు ప్రభావం ఎక్కువగా ఉంటుంది.
- ఒక గ్రాము ఇమాంఎక్టిన్ బెంజోఎట్ మందును ఒక లీటరు నీటిలో కలిపి కత్తెర పురుగు సోకిన పంటకు పిచికారీ చేస్తే పురుగును నివారించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

అంతర పంటలతో మేలు

పంట విత్తిన వారానికి ఎకరానికి 6 నుంచి 8 లింగాకర్షక బుట్టలు అమర్చి పురుగు ఉనికిని గమనించాలి. మొక్కజొన్న అంతర పంటలు సాగు చేస్తే పురుగు తక్కువగా ఆశిస్తుంది. పురుగు గుడ్లు పెట్టడానికి ఆకర్షించే నేపియర్ గడ్డిని మొక్కజొన్న పంట చుట్టు నాలుగు వరుసల్లో సాగు చేయాలి. కత్తెర పురుగును గమనించిన వెంటనే పొడి ఇసుకను మొక్కజొన్న సుడుల్లో వేయాలి. ఇసుక రాపిడికి లార్వాలు చనిపోతాయి. విషపు ఎరను మొక్క సుడిలో ఉదయం, సాయంత్రం వేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

సలహాలు పాటించాలి



మొక్క జొన్న పంటకు కత్తెర పురుగు వ్యాపిస్తుండంతో రైతులు తగిన మందులు పిచికారీ చేయాలి. వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు విధిగా పాటించాలి. పురుగు నివారణకు ఇమాంఎక్టిన్ బెంజోఎట్ అనే 1 గ్రాము మందును లీటరు నీటిలో కలిపి మొక్కజొన్న పంట పై పిచికారీ చేయాలి.

– నిషాంత్‌కుమార్, మండలవ్యవసాయ అధికారి, షాద్‌నగర్

స్థానికులకే టికెట్ ఇవ్వాలి

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కోరిన సత్యనారాయణరెడ్డి



ఢిల్లీలో రేవంత్‌రెడ్డిని కలిసిన సత్యనారాయణరెడ్డి, భీంభరత్, దర్శన్, వసంతం తదితరులు

షాబాద్: చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా స్థానికులకే అవకాశం ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు చింపుల సత్యనారాయణరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఢిల్లీలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పార్టీ జాతీయ ఎన్నికల కమిషన్ సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, వంశీచంద్‌రెడ్డిని కలిసినట్లు తెలిపారు. పీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహణ సభ్యుడు పామెన భీంభరత్, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, సీనియర్ నాయకుడు సున్నపు వసంతం ఈ ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చినా చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్, బి–బ్లాక్ అధ్యక్షుడు పోలీస్ మధుసూదన్‌రెడ్డి, నవాబ్‌పేట్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, చేవెళ్ల సర్పంచ్ శైలజారెడ్డి, సహకార సంఘం చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు మధుసూదన్‌గుప్తా, తదితరులున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి



ఎన్‌సీడీ కిట్లను అందజేస్తున్న జయలక్ష్మి

కొత్తూరు: ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె కొత్తూరు పీహెచ్‌సీ పరిధిలోని తిమ్మాపూర్, గూడూరు గ్రామాల్లో నిర్వహిస్తున్న హెల్త్ మేళా కార్యక్రమాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిశుభ్రత పాటిస్తే సాధ్యామైనంత వరకు రోగాలకు దూరంగా ఉంటామన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, వ్యాక్సినేషన్లు, తదితర అంశాలపై వైద్యురాలు అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన జీవనం కోసం క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా చేయాలని సూచించారు. అనారోగ్యాలకు గురైతే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రాథమిక దశలో వ్యాదులను గుర్తించి చికిత్సలు తీసుకుంటే చాలా వరకు ప్రయోజనం ఉంటుందనే విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. అనంతరం బీపీ, షుగర్ పేషంట్లకు ఎన్‌సీడీ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఉదయ్‌కిరణ్, సరిత, సిబ్బంది శ్రీనివాసులు, రవికుమార్, అనసూయ, ఏఎన్‌ఎంలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీశైలం



చేవెళ్ల: సీఐ లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బీఎస్పీ నాయకులు

చేవెళ్ల: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎన్‌ఆర్‌ఐ రాజ్‌బొడాపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు చందు అన్నారు. ఈ మేరకు ఆయన పార్టీ నాయకులతో కలిసి చేవెళ్ల పీఎస్‌లో సీఐ లక్ష్మారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడ్లడుతూ.. రాష్ట్రంలో బీఎస్పీ బలపడుతోందని అమెరికాలోని కాంగ్రెస్ అనుచరుడు రాజ్‌బోడా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయటం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో పార్టీ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి రామచంద్రం, నవాబ్‌పేట మండల అధ్యక్షుడు కె.సుధాకర్, చేవెళ్ల మండల అధ్యక్షుడు కుమార్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ రాజును అరెస్టు చేయాలి

షాబాద్: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బోడ రాజును వెంటనే అరెస్టు చేయాలని బీఎస్పీ చేవెళ్ల నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శ్రీశైలం, మండల అధ్యక్షుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం షాబాద్ పీఎస్‌లో సీఐ యాదయ్యగౌడ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను ఐక్యం చేసి కాంగ్రెస్‌ను కనుమరుగు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రవికుమార్, శ్రీనివాస్, మహేందర్, కృష్ణ, స్వామి తదితరులున్నారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్ జోలికి వస్తే సహించం

కొందుర్గు: బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ జోలికి వస్తే సహించేది లేదని బీఎస్పీ మండలాధ్యక్షుడు దుర్గని శ్రీను హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం రాజ్‌బోడాపై కొందుర్గు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దర్శన్, రాజేశ్ చౌహాన్, శ్రీనివాస్, వెంకిర్యాల, ఆనంద్, రామకృష్ణ, రాజు, రమేశ్, పవన్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే లక్ష్యసాధన



చేవెళ్ల కేజీబీవీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జేపీ రావు

చేవెళ్ల: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు ఏర్పరుచుకుని వాటిని సాధించేలా చదవాలని కేరీర్ గైడెన్స్ నిపుణులు జేపీ రావు అన్నారు. మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కేరీర్ కౌన్సిలింగ్, గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతోనే లక్ష్యాలను సాధించగలమన్నారు. ఈ కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్ట్ మేనేజర్ బద్రయ్య, ప్రిన్సిపాల్ శ్వేత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలి

షాబాద్: విద్యార్థినులు తమ తల్లిదండ్రులు కలలను నెరవేర్చాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారి కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు స్కూల్ కెరీర్, కౌన్సెలింగ్, కెరీర్ గైడెన్స్ పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువు సంస్కారం, జీవితంలో పాటించాల్సిన విలువలపై వివరించారు. పదవ తరగతి తరువాత కోర్సులు, ఉద్యోగాల వివరాలు, లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. జీవితంలో మనిషి ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడేది చదువేనని.. క్రమశిక్షణ, జిజ్ఞాస, సన్మార్గంలో పయనించే విద్యను ప్రతి ఒక్కరూ నేర్చుకున్నప్పుడే సమాజావృద్ధి జరుగుతుందన్నారు. సానుకూల దృక్పథాన్ని కలిగిన ఆలోచనలు లక్ష్య సాధన వైపు ప్రోత్సహించాల్సిన బాధ్యత అధ్యాపకులదేనని సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్‌స్పన్ మేనేజర్ బద్రయ్య, జేపీ రావు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



షాద్‌నగర్‌రూరల్: మాట్లాడుతున్న రాజు

షాద్‌నగర్‌రూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించే వరకు ప్రభుత్వంపై పోరాటాన్ని కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ గురువారం సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు నియోజకవర్గంలోని ఆరు మండలాలలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజును అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. క్యాంపు కార్యాలయం వద్ద ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఒక్క సారిగా మూకుమ్మడిగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.... అంగన్‌వాడీలు తమ సమస్యలను పరిష్కరించాలని 12 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. లేదంటే ప్రగతి భవన్, సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామన్నారు. అక్కడికి చేరుకున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అందుబాటులో లేరని, రెండు రోజుల్లో అంగన్‌వాడీలతో మాట్లాడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, ఏఐటీయూసీ ఇండస్ట్రియల్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను, నాయకులు శ్రీనునాయక్, ఈశ్వర్‌నాయక్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు జయమ్మ, శారద, సువర్ణ, రజియా, చంద్రకళ, మణెమ్మ, వినోద, సంగీత, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను అడ్డుకుంటాం..



శంకర్‌పల్లి: డిప్యూటీ తహసీల్దార్ ప్రియాంకకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

శంకర్‌పల్లి: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించకపోతే మంత్రులను ఎక్కడిఅక్కడ అడ్డుకుంటామని సీఐటీయూ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లతో కలిసి పట్టణ కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రియాంకకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల నాయకుడు నర్సింహ, అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఉమ, స్వప్న, ప్రవీణ, అనిత, శంకర్‌పల్లి మండల నాయకురాళ్లు ప్రమీల. మంగమ్మ, కల్పన, రాధ, సుజాత, యాదమ్మ, పద్మారాణి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ముందస్తు అరెస్టు

కొందుర్గు: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ జేఏసీ శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయమే కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు చెందిన అంగన్‌వాడి కార్యకర్తలను, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఠాణాలకు తరలించారు. అరెస్టు చేసిన వారిలో సీఐటీయూ మండల కార్యదర్శి గోపాల్, నాయకులు యామిని, మాణమ్మ, భాగ్య, రజియా ఉన్నారు.

గడపగడపకూ గ్యారెంటీలు

పీసీసీ ప్రధానకార్యదర్శి వీర్లపల్లి శంకర్



ఆరు గ్యారంటీ పథకాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీర్లపల్లి శంకర్ తదితరులు

షాద్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ నేత సోనియాగాంధీ తక్కుగూడ విజయభేరి సభలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను గడప గడపకు తీసుకువెళతామని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ముఖ్య నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీర్లపల్లిశంకర్ మాట్లాడుతూ.. ప్రజల కష్టాలను దగ్గరగా చూసిన దివంగత సీఎం, మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రజలకోసం పాదయాత్రను చేపట్టారని అన్నారు. పాదయాత్రతో పార్టీకి వన్నె తేవడంతో పాటుగా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన మహానాయకుడు డాక్టర్ వైఎస్సార్ అన్నారు. వైఎస్సాఆర్ తీసుకువచ్చిన పథకాలనే బీజేపీ, బీఆర్‌ఎస్ అమలు చేస్తున్నాయన్నారు. నిరుపేదల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను తీసుకురావడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ పథకాలను ఈ నెల 25న నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఇంటింటికి తీసుకువెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు యాదయ్యయాదవ్, బాబర్‌అలీఖాన్, రఘు, చల్లాశ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, చెన్నయ్య, జగదీశ్వర్, తిరుపతిరెడ్డి, శ్రీశైలం, రాజు, సుదర్శన్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

జెడ్పీటీసీ సభ్యురాలు గోవిందమ్మ

శంకర్‌పల్లి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శంకర్‌పల్లి జెడ్పీటీసీ సభ్యురాలు గోవిందమ్మ అన్నారు. మండలంలోని మహాలింగపురం గ్రామంలోని వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఆమె ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాణిక్య రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు యాదగిరి, ఏఎంసీ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు సాత ప్రవీణ్‌కుమార్, పార్శి బాలకృష్ణ, గోపాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి



మొయినాబాద్‌రూరల్: జెడ్పీటీసీ శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్ రూరల్: ప్రతీ ఒక్కరు భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని మొయినాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు కాలె శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఆయన అజీజ్‌నగర్ గ్రామంలో పోచమ్మ దేవాలయం సమీపంలో మంగలి అద్వానీ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాములు, అద్వానీ, శ్రీశైలం, రాజు, చెన్నారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: పూజల్లో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు గోవిందమ్మ తదితరులు

‘శ్రీవాణి’ మండల కమిటీ ఎన్నిక

కొందుర్గు: శ్రీవాణి సాంస్కృతిక సంస్థ జిల్లేడ్ చౌదరిగూడ మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా భూపాల్‌రెడ్డి, అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మయ్య, శేఖరయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా కిష్టయ్య ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా రాములు, శ్రీశైలం, యాదయ్య, కార్యనిర్వహణ కార్యదర్శిగా మొగులయ్య గౌడ్, సలహాదారులుగా బాలచంద్రయ్య, రామచంద్రయ్య, వెంకటయ్య తదితరులు నియమితులయ్యారు.

గంగమ్మ ఒడికి గణనాథులు

చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో గణనాథుడి శోభాయాత్రలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆయా మండపాల వద్ద లడ్డూ వేలం నిర్వహించారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలో పలు గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించి గణేశ్ నిమజ్జనాలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



చేవెళ్ల: గుండాలలో వేలంలో లడ్డూ కైవసం చేసుకున్న భక్తులు



చేవెళ్ల: పూజల్లో పాల్గొన్న సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు



షాబాద్: రూ.62వేలకు బాల వినాయకుడి లడ్డూ కైవసం చేసుకున్న శివ